www.eenadupratibha.net

# కాకతీయ అనంతర యుగం

## ముసునూరి నాయకరాజులు (1325 – 68)

కాకతీయ సామ్రాజ్య పతనం తర్వాత ఆంధ్రదేశంలో ముసునూరి నాయకరాజులు, రాచకొండ రేచర్ల వెలమలు, కొండవీడు, రాజమహేంద్రవరం రెడ్డి రాజులు ప్రాబల్యం వహించారు. ఓరుగల్లును ఆక్రమించిన ముస్లిం పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాట్లు చేసి, హిందూమతాన్ని, తెలుగు భాషా, సంస్కృతులను కాపాడటంలో ఈ పాలకులు ఎంతో ధైర్యసాహసాలు చూపారు.

ప్రోలయ నాయకుడి విలస తామ్రశాసనం, కాపయనాయకుడి పోలవరం శాసనం, చోడ భక్తిరాజు పెంటపాడు శాసనం, అనితల్లి కలువచేరు శాసనాలు వీరి చరిత్రకు ఆధారం. ముసునూరి వంశ స్థాపకుడు ప్రోలయ నాయకుడు (1325 – 33). వీరి స్వస్థలం కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలంలోని ముసునూరు. ఇతడు ఖమ్మం జిల్లాలో ఉన్న రేఖపల్లిని రాజధానిగా చేసుకుని, స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. 'ఆంధ్ర భూమండలాధ్యక్ష' లాంటి బిరుదులు పొందాడు. వెన్నయ్య అనే వ్యక్తికి అమలాపురం తాలుకాలో ఉన్న విలస గ్రామాన్ని దానం చేస్తూ, 'విలస తామ్ర శాసనం' వేయించాడు. ముస్లిం దాడులను ఎదుర్కోవడానికి సుమారు 75 మంది స్థానిక తెలుగు పాలకులు ఇతడి నాయకత్వంలో ఏకమయ్యారని అనితల్లి కలువచేరు శాసనం వివరిస్తోంది.

★ ప్రోలయ అనంతరం అతడి పినతండ్రి కుమారుడైన కాపయ నాయకుడు (1333 – 68) పాలనకు వచ్చాడు. ఓరుగల్లుపై దండెత్తి మాలిక్ మక్బూల్‌ను ఓడించి 'ఆంధ్ర సురత్రాణ, ఆంధ్రదేశాధీశ్వర' లాంటి బిరుదులు పొందాడు. రాజధానిని రేఖపల్లి నుంచి ఓరుగల్లుకు మార్చాడు. కోరుకొండ దుర్గాన్ని నిర్మించి కూనయ నాయకుడి రాజప్రతినిధిగా నియమించాడు. బహమనీ పాలకుడు హసన్‌గంగూ బహమనీ పంపిన సికిందర్‌ఖాన్ చేతిలో ఓడిపోయిన కాపయ నాయకుడు కౌలాస్ దుర్గాన్ని (నిజామాబాద్ జిల్లా), అపార ధనరాసులను ఇవ్వాల్సి వచ్చింది. కాపయ కుమారుడైన వినాయకదేవుడు బహమనీ సుల్తాన్ మహమ్మద్‌షా చేతిలో ఓడి, మరణించాడు. గోల్కొండను కూడా బహమనీలకు కోల్పోయాడు. కాపయను 1368లో రేచర్ల వెలమ పాలకుడైన అనపోతానాయుడు భీమవరం యుద్ధంలో వధించాడు. దీంతో ఓరుగల్లు, భువనగిరి దుర్గాలు రేచర్ల పద్మనాయకుల రాజ్యంలో విలీనమయ్యాయి. కాపయ నాయకుడి కాలంలో జీవించిన మడికి సింగన 'సకలనీతి సమ్మతం' అనే గ్రంథాన్ని రచించాడు.

## రేచర్ల పద్మనాయకులు (వెలమ దొరలు) (1324 – 1475)

రేచర్ల పద్మనాయక వంశ మూలపురుషుడు బేతాళ నాయకుడు. కానీ వెలుగోటి వారి వంశావళి చెవ్విరెడ్డిని ఈ వంశ మూల పురుషుడిగా పేర్కొంటోంది. రుద్రమదేవి కాలంలో మంత్రిగా పనిచేసిన రేచర్ల ప్రసాదిత్యుడు కాకతీయ రాజ్యస్థాపనాచార్య, రాయ పితామహాంక లాంటి బిరుదులు పొందాడు. రేచర్ల పద్మనాయక స్వతంత్ర్య రాజ్యస్థాపకుడు మొదటి సింగమ నాయకుడు. ఇతడు పిల్లలమర్రిని (ఆమనగల్లు) రాజధానిగా చేసుకుని పాలించాడు. ఇతడి ఆస్థానంలో ఉన్న శాకల్యమల్లుభట్టు అనే కవి ఉత్తర రాఘవకావ్య, నిరోష్ఠ్య రామాయణం లాంటి గ్రంథాలను రచించాడు. అనంతరం మొదటి సింగముని కుమారుడైన అనపోతానాయుడు రాజ్యానికి వచ్చాడు. ఇతడి కాలంలోనే రెడ్డి – వెలమ సంఘర్షణలు మొదలయ్యాయి.

★ కొండవీటి రెడ్డిరాజైన అనపోతారెడ్డిని ఓడించి, శ్రీశైలం ప్రాంతాన్ని ఆక్రమించాడు. ఖడ్గ నారాయణ, హిందూరాయ, సోమకుల పరశురామ లాంటి బిరుదులు పొందాడు. ఆంధ్రదేశాధీశ్వర బిరుదు కూడా పొందినట్లు వెలుగోటివారి వంశావళి పేర్కొంటుంది. తన సోదరుడైన మాదానాయకుడిని దేవరకొండ రాజధానికి పాలకుడిగా నియమించాడు. తన రాజధానిని పిల్లలమర్రి/ఆమనగల్లు నుంచి రాచకొండకు మార్చాడు. అనపోతుడి మంత్రి తిప్పరాజు.

★ అనపోతుడి అనంతరం కుమార సింగముడు లేదా రెండో సింగముడు రాజ్యానికి వచ్చాడు. ఇతడు గొప్పకవి. సంగీత సుధాకరం, రసార్ణవ సుధాకరం, రత్న పాంచాలిక లాంటి గ్రంథాలు రచించాడు. సర్వజ్ఞ, సర్వజ్ఞ చక్రవర్తి లాంటి బిరుదులు పొందాడు. ఇతడు యువరాజుగా ఉన్నప్పుడే కళ్యాణదుర్గాన్ని జయించి, అక్కడ విజయ స్తంభాన్ని నాటాడు. ఇతడి ఆస్థానకవి విశ్వేశ్వరుడు 'చమత్కార చంద్రిక' అనే గ్రంథాన్ని రాశాడు. ఈ కవి సాహిత్య శిల్పాభివృద్ధి అనే బిరుదు పొందాడు.

★ రెండో సింగ అనంతరం రెండో అనపోతుడు, మాదానీడు, మూడో సింగముడు మొదలైన రాజులు పరిపాలించారు. మాదానీడి కాలంలో అతడి భార్య నాగాంబిక నాగసముద్రం చెరువును తవ్వించింది. మాదానీడు కూడా తాడూరు గ్రామాన్ని శ్రీరంగనాథ స్వామికి దానం చేశాడు. ఇతడు రామాయణానికి రాఘవీయం పేరుతో వ్యాఖ్యానం కూడా రాశాడు.

★ చివరి పాలకుడు మూడో సింగముడు. ఇతడి కాలంలోనే ఇతడి సోదరుడు రామధర్మానాయుడు ముచ్చర్ల, ముందుపల్లెలను వేంకటేశ్వరస్వామికి దానం చేస్తూ, శాయింపేట శాసనం వేయించాడు. మూడో సింగముని ఆస్థానంలో బమ్మెర పోతన కొంత కాలం జీవించినట్లు తెలుస్తోంది. మూడో సింగ మరణం గురించి విష్ణుభక్తి సుధాకరం, ఉషాభ్యుదయ గ్రంథాలు పేర్కొంటున్నాయి.

www.eenadupratibha.net

## రెడ్డి రాజులు

కాకతీయుల పతనానంతరం సింహాచలం – విక్రమసింహపురం (నెల్లూరు) మధ్య ఉన్న తీరాంధ్ర దేశాన్ని రెడ్డి రాజులు పాలించారు. రెడ్డి వంశ మూలపురుషుడు కోమటి ప్రోలారెడ్డి కాగా రాజ్య స్థాపకుడు ప్రోలయ వేమారెడ్డి. రెడ్డి రాజుల్లో కొండవీడు రెడ్డి రాజులు, రాజమండ్రి రెడ్డి రాజులు, కందుకూరు రెడ్డి రాజులు అనే మూడు ప్రధాన రాజ్యాలు ఉన్నాయి. రెడ్డి రాజులు నెల్లూరు చోడరాజుల సామంతులుగా ఉండేవారు. వీరిని దేసటి వంశీయులుగా, పంటశాఖీయులుగా పేర్కొంటారు.

### ప్రోలయ వేమారెడ్డి

ఇతడు కాకతీయ రాజు రెండో ప్రతాపరుద్రుడి ఆస్థానంలో నాయంకరుడిగా ఉండేవాడు. అనితల్లి కలువచేరు శాసనం మాత్రం ఇతడు కాపయనాయకుడి ఆస్థానంలో ఉన్నట్లు పేర్కొంటోంది. అద్దంకి రాజధానిగా రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు. బహమనీలను ఓడించి, మోటుపల్లి రేవును స్వాధీనం చేసుకున్నాడు. మ్లేచ్ఛాబ్ధికుంభోద్భవ, ధర్మ ప్రతిష్ఠానగురుడు లాంటి బిరుదులు పొందాడు. శ్రీశైలంలో పాతాళ గంగకు, అహోబిలం కొండకు మెట్లు కట్టించాడు. ఎర్రాప్రగడ, శ్రీగిరి ప్రథమ కవులను పోషించాడు. అన్న మాచారెడ్డిని చందోలు దుర్గానికి, తమ్ముడు మల్లారెడ్డిని కందుకూరుకు అధిపతులుగా నియమించాడు.

### అనపోతారెడ్డి (1353 – 64)

ద్రాక్షారామ, మోటుపల్లి, అమరావతి శాసనాలు ఇతడి విజయాల గురించి వివరిస్తున్నాయి. ద్వీపజేత, జగనొబ్బగండ లాంటి బిరుదులు పొందాడు. రాజధానిని అద్దంకి నుంచి కొండవీడుకు మార్చినట్లు మాన్యమాపుర శాసనం తెలియజేస్తోంది. బాలసరస్వతి అనే కవి ఇతడి కాలంనాటి శాసనాలను రచించాడు. అనవోతారెడ్డి/ అనపోతారెడ్డి రేచర్ల వెలమ పాలకుడు అనవోతానాయకుడి చేతిలో ఓడి పోయి, శ్రీశైలం ప్రాంతాన్ని కోల్పోయాడు.

### అనవేమారెడ్డి (1364 – 86)

రెడ్డి రాజుల్లో సుప్రసిద్ధుడు. దివిదుర్గ విశాల, సకల జలదుర్గ సాధక, ఛురికా సహాయ, ప్రజాపరిచిత చతుర్విధోపాయ, వసంతరాయ లాంటి బిరుదులు పొందాడు. ఇతడి సేనాని చెన్నమ నాయకుడు వడ్డాది పాలకుడు వీరార్జున దేవుడిని ఓడించి, గొట్టివాడ గ్రామాన్ని సింహాచలేశునకు దానం చేసినట్లు సింహాచల శాసనం తెలియజేస్తోంది. అనవేముడు శ్రీశైలంలో వీర శిరోమండపాన్ని (చంపుడిగుడి), సింహాచలంలో అనవేమాపురి మండపాన్ని నిర్మించాడు. ప్రతి సంవత్సరం వసంతోత్సవాలు నిర్వహించి, వసంతరాయలు అనే బిరుదు పొందాడు. విష్ణుపురాణం గ్రంథాన్ని రాసిన వెన్నెలకంటి సూరన ఇతడి సమకాలీనుడు.

### కుమార గిరిరెడ్డి (1386 – 1402)

ఇతడు అనపోతారెడ్డి కుమారుడు. అధికారం కోసం అనవేమారెడ్డి కుమారుడైన పెదకోమటి వేమారెడ్డితో వారసత్వ యుద్ధం చేయాల్సి వచ్చింది. ఇతడి కాలంలోనే విజయనగర రాజులు శ్రీశైలం, త్రిపురాంతకాలను ఆక్రమించారు. బహమనీ సుల్తానుల దాడులను గజపతిరావు తిప్ప, గజపతుల దాడులను దేవయ సేనాని తిప్పికొట్టారు. ఇతడి ఆస్థానంలో లకుమాదేవి అనే నర్తకి ఉండేది. ఇతడు వసంత రాజీయం అనే నాట్యశాస్త్ర గ్రంథాన్ని రాశాడు. కర్పూర వసంతరాయలు అనే బిరుదు పొందాడు. అవచి తిప్పయ్యశెట్టి వసంతోత్సవాలకు సహాయం చేసేవాడని శ్రీనాథుని హరవిలాసం గ్రంథం పేర్కొంటోంది. చివరికి పెదకోమటి వేమారెడ్డి చేతిలో ఓడిపోయి, రాజమండ్రి వచ్చి మరణించాడు. విజయనగర రాజుల దండయాత్రలను రెండో హరిహరుడి యనమదల శాసనం, మొదటి దేవరాయల మార్కొండపాడు శాసనం వివరిస్తున్నాయి.

### పెదకోమటి వేమారెడ్డి (1402 – 20)

కుమార గిరిరెడ్డిని తరిమివేసి కొండవీడు పాలకుడయ్యాడు. కాటయ వేమారెడ్డికి సహాయంగా రెండో హరిహరరాయలు చౌండపసేనానిని పంపాడు. కానీ, పెదకోమటి వేమారెడ్డి సేనాని గజరావు తిప్పన గుండుగొలను, కానూరు యుద్ధాల్లో (పశ్చిమ గోదావరి జిల్లా) కాటయ వేముడిని ఓడించాడు. తర్వాత అత్తిలి, కాకరపర్రు యుద్ధాల్లో కూడా కాటయ వేమారెడ్డి ఓడిపోయాడు. కానీ ఫిరోజ్ షా, పెదకోమటి వేమారెడ్డిల సంయుక్త సైన్యాన్ని అల్లాడరెడ్డి రామేశ్వరం యుద్ధంలో ఓడించినట్లు శివలీలా విలాసం గ్రంథం పేర్కొంటోంది. ఇతడి కాలంలోనే విజయనగర రాజు మొదటి దేవరాయలు 1416లో మోటుపల్లి అభయ శాసనాన్ని వేయించాడు.

★ పెదకోమటి వేమారెడ్డి మంత్రి మామిడి సింగన. శ్రీనాథుడు ఆస్థాన విద్యాధికారిగా పని చేశాడు. శ్రీనాథుడు తన శృంగార నైషధం గ్రంథాన్ని మామిడి సింగనకు అంకితమిచ్చాడు. ఆస్థాన కవి వామనభట్ట బాణుడు. శ్రీనాథుడు విజయనగర రాజు రెండో

దేవరాయల ఆస్థానాన్ని సందర్శించి, గౌడ డిండిమభట్టును ఓడించి, గండపెండేరం తొడిగించుకున్నాడు. కవిసార్వభౌమ బిరుదు పొందాడు. పెదకోమటి వేమారెడ్డి సంగీత చింతామణి, సాహిత్య చింతామణి, శృంగార దీపిక, శప్తశతి చరితిక అనే గ్రంథాలను రచించి, సర్వజ్ఞ చక్రవర్తి అనే బిరుదు పొందాడు. ఇతడి భార్య సూరాంబిక ఫిరంగిపురం (గుంటూరు జిల్లా) వద్ద సంతానసాగరం అనే చెరువును తవ్వించింది. ఈ కాలంలోనే రేచర్ల వెలమల ఆస్థానంలో ఉన్న పోతన ఆంధ్ర మహాభాగవతాన్ని రాశాడు.

**రాచ వేమారెడ్డి (1420 – 24)**

కొండవీటి రెడ్డి రాజుల్లో చివరి పాలకుడు రాచ వేమారెడ్డి తన తల్లి సూరాంబిక తవ్వించిన సంతాన సాగరం చెరువుకు జగనొబ్బగండ అనే కాలువను తవ్వించినట్లు అమీనాబాద్ శాసనం ద్వారా తెలుస్తోంది. ఇతడు పురిటి సుంకం, పొయ్యిలపై పన్ను విధించినట్లు తెలుస్తోంది. సవరం ఎల్లయ్య అనే బలిజ నాయకుడు రాచ వేమారెడ్డిని అద్దంకి వీధిలో వధించాడని కొండవీటి కైఫియత్ తెలియజేస్తోంది.

## రాజమండ్రి రెడ్డి రాజులు

**కాటయ వేమారెడ్డి**

రాజమండ్రి కేంద్రంగా స్వతంత్ర రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు కుమారగిరి రెడ్డి బావ. పెదకోమటి వేమారెడ్డి చేతిలో గుండుగొలను యుద్ధంలో మరణించాడు. కాటయ వేముడు రెండో హరిరాయలను ఓడించి, అతడి కుమార్తె హరిహరాంబికను వివాహం చేసుకున్నాడు. ఇతడు కాళిదాసు రచనలపై కుమారగిరి రాజీయం అనే వ్యాఖ్యానం రాశాడు. ఇతడి అనంతరం రెండో కుమారుడు రెండో కుమారగిరి రెడ్డి రాజ్యానికి వచ్చాడు. కానీ ఇతడు బాలుడైనందున అల్లాడరెడ్డి రాజ్యభారం వహించాడు. అల్లాడరెడ్డి రామేశ్వరం యుద్ధంలో పెదకోమటి వేమారెడ్డిని ఓడించాడు. పలివెల, వేమవరం శాసనాలు వేయించాడు. ఇతడి సేనాని నరహరినీడు పాలకొల్లు శాసనం వేయించాడు. అల్లాడరెడ్డి మరణం తర్వాత మూడో కుమారగిరి రెడ్డి, మూడో అనవోతారెడ్డి, వీరభద్రారెడ్డి వరుసగా పాలించారు. 1422 నాటి కొమ్ముచిక్కాల శాసనం మూడో అనవోతుడు రాజమండ్రి కేంద్రంగా పాలించినట్లు పేర్కొంటోంది.

★ చివరి పాలకుడు వీరభద్రారెడ్డి (1423 – 48). ఇతడి అన్న వేమారెడ్డి వాస్తవ అధికారాలు చెలాయించేవాడు. రెండో దేవరాయల సహాయంతో ఒరిస్సా గజపతులను ఎదిరించాడు. రెండో దేవరాయల సేనానులు తెలుంగరాయల శాసనం సింహాచలంలో, మల్లప్ప ఒడయార్ శాసనం ద్రాక్షారామంలో లభించాయి. చివరికి కపిలేశ్వర గజపతి రాజమండ్రి రెడ్డి రాజ్యాన్ని 1448 నాటికి తన సామ్రాజ్యంలో విలీనం చేశాడు.

## కందుకూరు రెడ్డి రాజ్యం

ప్రోలయ వేమారెడ్డి సోదరుడు, సర్వ సైన్యాధ్యక్షుడు అయిన మల్లారెడ్డి కందుకూరు పాలకుడిగా నియమితుడయ్యాడు. ఇతడు మోటుపల్లిని జయించాడు. ధరణికోట యుద్ధంలో హసన్‌గంగూ బహమనీ షాను ఓడించాడు. అతడి వారసులు కందుకూరు రాజధానిగా పాలించారు. మల్లారెడ్డి మనుమడు శ్రీగిరి కాలంలో రాజ్యం బలపడింది. శ్రీగిరి వ్యవసాయాభివృద్ధికి అనేక చెరువులు తవ్వించాడు. అనంతరం రెండో కోమటిరెడ్డి, మూడో కోమటిరెడ్డి పాలించారు. ఈ రాజ్యం విజయనగర సామ్రాజ్యంలో విలీనమైంది.

# నమూనా ప్రశ్నలు

**1.** విలస తామ్ర శాసనం వేయించిన పాలకుడు ఎవరు?

1) కాపయ నాయకుడు　　2) ప్రోలయ నాయకుడు

3) చోడ భక్తిరాజు　　4) ఎవరూ కాదు

**2.** ఆంధ్ర సురత్రాణ, ఆంధ్ర దేశాధీశ్వర లాంటి బిరుదులు పొందిన రాజు?

1) కాపయ నాయకుడు　　2) ప్రోలయ నాయకడు

3) సింగ I　　4) సింగ II

**3.** రాజధానిని పిల్లలమర్రి నుంచి రాచకొండకు మార్చింది ఎవరు?

1) సింగ I　　2) సింగ II　　3) సింగ III　　4) అనవోతానాయుడు

4. బమ్మెర పోతన ఏ రాజుల ఆస్థానంలో జీవించినట్లు తెలుస్తోంది?

1) ముసునూరి పాలకులు
2) రేచర్ల వెలమలు
3) కొండవీటి రెడ్లు
4) రాజమండ్రి రెడ్లు

5. కర్పూర వసంత రాయలు అనే బిరుదు పొందిన రెడ్డి రాజు?

1) ప్రోలయ వేమారెడ్డి
2) అనవేమారెడ్డి
3) కాటయ వేమారెడ్డి
4) కుమారగిరి రెడ్డి

6. శ్రీశైలంలో పాతాళగంగకు మెట్లు కట్టించిన పాలకుడు ఎవరు?

1) ప్రోలయ వేమారెడ్డి
2) అనపోతారెడ్డి
3) అనవేమారెడ్డి
4) శ్రీకృష్ణదేవరాయలు

7. శ్రీనాథుడు పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో.......?

1) కవి
2) మంత్రి
3) విద్యాధికారి
4) విదూషకుడు

8. సర్వజ్ఞ చక్రవర్తి బిరుదు పొందిన రెడ్డి రాజు ఎవరు?

1) ప్రోలయ వేమారెడ్డి
2) పెదకోమటి వేమారెడ్డి
3) అనవేమారెడ్డి
4) అనపోతారెడ్డి

## జవాబులు

1-2; 2-1; 3-1; 4-2; 5-4; 6-1; 7-3; 8-2.

రచయిత: బి. నాగరాజు

www.eenadupratibha.net